బోథ్ మండల విద్యాధికారికి సన్మానం

బోథ్, నవంబర్ 9 : బోథ్ మండల విద్యాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కుమ్మరి పోశెట్టిని శనివారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, పొచ్చెర మాజీ సర్పంచ్ మల్లేశ్, రవి శాలువాతో సన్మానించారు. అన్ని విద్యా సంస్థలు మెరుగు పర్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారు ఎంఈవోను కోరారు.

నత్తనడకన రోడ్డు పనులు

ఇచ్చోడ, నవంబర్ 9: మండల కేంద్రంలో కొద్ది రోజుల నుంచి రోడ్డు పనులు నతనడకన కొనసాగుతున్నాయని టీజీవీపీ బోథ్ నియోజకవర్గ కన్వీనర్ గొర్ల నరేందర్ యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు పనులు జరుగుతున్న సమయంలో దుమ్ము ధూళి లేవకుండా నీరు చల్లాలి, కానీ కాంట్రాక్టర్ నిబంధనలు పాటించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రంలో రోడ్డు పనుల వల్ల ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

బజార్‌హత్నూర్, నవంబర్ 9: కొల్హారి గ్రామంలో రాహుఫ్ ఖాన్ అనే రైతుకు చెందిన ఎద్దు కరెంట్ షాక్ తగిలి మృతి చెందింది.. పంట పొలంలో పశుగ్రాసం కోసం వెతుకుతున్న క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందింది. ఎద్దు విలువ రూ.60 వేలు ఉంటుందని తెలిపారు.

తప్పులు లేకుండా సర్వే చేపట్టాలి

నార్నూర్, నవంబర్ 9 : సమగ్ర కుటుంబ సర్వేలో తప్పులు లేకుండా సర్వే చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి గంగాధర్ అన్నారు. ఖంపూర్ గ్రామంలో చేపడుతున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జాడి రాజాలింగం, ఎంపీడీవో జవహర్‌లాల్, ఎంపీవో స్వప్నశీల, ఏపీఎం మైస రమేశ్, ఎంఈవో అనిత పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నార్నూర్, నవంబర్ 9 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్ సూచించారు. నార్నూర్‌లోని గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలికల పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను శాలువాలతో సన్మానించారు.. రాథోడ్ కాజల్ అండర్-14 షాట్‌పూట్, జాదవ్ మౌనిక అండర్-14 క్యారంబోర్డు పోటీల్లో ప్రతిభ కనబర్చడం హర్షణీయమన్నారు. ఈ నెల 15వ తేదీన ఖమ్మం జిల్లాలోని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయిలో పోటీలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ విశ్వనాథ్, వార్డెన్ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడుగంటిన భీమన్న చెరువు

● సాగునీటి కోసం రైతుల కష్టాలు ● డీ-28 కాల్వకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్న రైతులు

పెంబిలో అడుగంటిన భీమన్న చెరువు

సాగునీటికోసం డీ-28 కాల్వ ద్వారా నీటిని తీసుకువచ్చేందుకు కష్టపడుతున్న రైతులు

విత్తన దశలో ఉన్న వరి పంట

పెంబి, నవంబర్ 9: పెంబిలోని భీమన్న చెరువుకు డీ-28 కాల్వ ద్వారా సాగునీరందక అడుగంటింది. డీ-28 కాల్వకు మరమ్మతులు చేపట్టి సాగునీరు అందించాలని నిర్మల్ కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేకు విన్నవించిన పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం వరి పంట విత్తన దశలో ఉండడంతో మరో రెండు తడులు సాగునీరు అందితేగాని పంట చేతికి రాదు. దీంతో రైతు చేసేదేమి లేక శనివారం ఆయకట్టు రైతుందరూ కలిసి మందపల్లి గ్రామం వద్ద డీ-28 కాల్వ ద్వారా భీమన్న చెరువు సాగునీటిని అందించడానికి మరమ్మతులు చేపట్టారు. సంచుల్లో ఇసుక నింపి చెరువులోకి నీరు వచ్చేలా అడ్డుకట్ట వేశారు. వానకాలం సీజన్‌లోనే సాగు నీరు అందడం లేదు యాసంగికి భూములు బీడుగా మారాల్సిందేనని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి డీ-28 కాల్వ ద్వారా భీమన్న చెరువులోకి సాగునీరు వచ్చేలా డీ-28 కాల్వకు శాశ్వత పరిష్కారంగా మరమ్మతులు చేపట్టాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తలమడుగు: పరామర్శిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

తలమడుగు, నవంబర్ 9 : ఉండం గ్రామంలో శుక్రవారం రాత్రి కల్లూరి చంద్రశేఖర్ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. శనివారం ఈ విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. షార్ట్ సర్క్యూట్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం ఉండం గ్రామానికి కంది సంతోష్, రుయ్యాడి గ్రామానికి చెందిన గణపతి, కుమ్మరి శేఖర్, చర్లపల్లి తూము లక్ష్మణ్ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుమ్మరి శేఖర్ కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బోథ్ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేశ్, నాయకులు కేదారేశ్వర్ రెడ్డి, అబ్దుల్లా, అభిరాం రెడ్డి, తిరుమల గౌడ్, వెంకట్ రెడ్డి, గజానంద్ ఉన్నారు.

తాంసి(భీంపూర్), నవంబర్ 9: భీంపూర్ మండలం నిపాని గ్రామ మాజీ సర్పంచ్ నాగయ్య ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. ఆయన వెంట ముకుంద సంతోష్, రాజన్న, అనిల్, నారాయణ రెడ్డి ఉన్నారు.

రైతులకు పెట్టుబడులు దక్కడం లేదు

ఎదులాపురం, నవంబర్ 9 : పత్తి మద్దతు ధర విషయంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, కనీసం పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితులు నెలకొన్నాయని అఖిల పక్ష రైతు సంఘం అధ్యక్షుడు బండి దత్తాత్రి అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి మద్దతు ధర పెంపు, తేమ నిబంధనల సడలింపు, రైతు భరోసా వంటి డిమాండ్ల సాధన కోసం అఖిల పక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతామని తెలిపారు. రైతులను సమీకరించడంలో భాగంగా కొద్ది రోజులుగా మండలాల వారీగా సమావేశాలు నిర్వహించామన్నారు. సమస్యలపై తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. తమకు జరుగుతున్న అన్యాయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీసేందుకు రైతులు ధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంఘాల నాయకులు రమేశ్, పోశెట్టి, గోవర్ధన్ యాదవ్,నారాయణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు ఆందోళన చెందొద్దు

ఎదులాపురం, నవంబర్ 9: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు ఆందోళన చెందొద్దని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనుక్కొని తిరిగి అప్పచెప్పడం జరుగుతుందని ఏఎస్పీ సురేందర్ రాదవ్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ వన్ టౌన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు ఎం.స్వప్న, అపూర్వ, కొత్తూరు కార్తీక్‌కు వారి ఫోన్లను ఏఎస్పీ అందజేశారు. డీఎస్పీ జీవన్ రెడ్డి, వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

తీర్థయాత్రల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఎదులాపురం, నవంబర్ 9 : పుణ్యక్షేత్రాల దర్శనం, తీర్థయాత్రల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నదని ఆర్ఎం సోలోమన్ అన్నారు. తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ముందస్తుగా బుక్ చేసుకున్న ప్రయాణికులతో శనివారం ప్రత్యేక బస్సు ఆదిలాబాద్ బస్టాండ్ నుంచి బయలుదేరింది. కాగా ఆర్ఎం సోలోమన్, డిప్యూటీ ఆర్ఎం ప్రవీణ్, ఆర్ఎంవో ప్రణీత్, డీఎం కల్పనతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఆర్టీసీ కల్పిస్తున్న అవకాశాలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎం శ్రీకర్, రాజేందర్, ఎస్ఎం శ్రీనివాస్, రిజర్వేషన్ కౌంటర్ ఇన్‌చార్జి ఎస్ఏ హుస్సేన్ పాల్గొన్నారు.

బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్

ఉర్దూ భాష అభివృద్ధికి కృషి చేయాలి

ఎదులాపురం, నవంబర్ 9 : ప్రముఖ ఉర్దూ కవి అల్లామా మహ్మద్ ఇక్బాల్ జన్మదినాన్ని పురస్కరించుని ఆదిలాబాద్‌ని టీఎన్జీవో సంఘ భవనంలో తెలంగాణ మైనార్టీస్ ప్రైవేట్ రికగ్నైజ్డ్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఉర్దూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉర్దూ రంగంలో రాణిస్తున్న పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ ఉర్దూ ఉపాధ్యాయుడు అబు మజర్‌రజా, అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహ్మద్ అమీరొద్దీన్, ఫైసల్బీన్ వహాబ్, తన్వీర్ పరేఖ్ పాల్గొన్నారు.

బేల మార్కెట్ అధికారుల తీరు మార్చుకోండి

బేల, నవంబర్ 9 : బేల సబ్ మార్కెట్ యార్డులో సోయా కొనుగోళ్లు చేస్తున్న మార్క్‌ఫెడ్, సొసైటీ అధికారులు ఇకనైనా తీరు మార్చుకోవాలని జైనథ్, బేల మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో సోయా కొనుగోలు తీరును ఆయన పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ వారం రోజులుగా రైతులు సోయా కొనుగోలులో మార్కెట్ అధికారులు డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. మార్కెట్ అధికారులు ఎవరైన రైతుల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేస్తే కచ్చితంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా చూస్తానని సూచించారు. మార్కెట్ యార్డులో మరో రెండు కాంటలు, లేబర్లు అదనంగా పంపించడానికి ప్రయత్నిస్తానని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ విలాస్ పాటిల్, డైరెక్టర్ చంద్రకాంత్, నాయకులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమిద్దాం

ఖానాపూర్ టౌన్, నవంబర్ 9: అమరుల స్ఫూర్తితో ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమిద్దామని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ అన్నారు. అమరవీరుల వారోత్సవాలను శనివారం ఖానాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. పాలకవర్గ పార్టీలు అధికారం కోసం తప్పుడు పద్ధతులను అవలంబిస్తూ ప్రజలను కష్టాల సుడిగుండంలో నెట్టుతున్నాయని విమర్శించారు. ఇప్పటికైన ప్రభుత్వాలు ప్రజల ఆర్థిక అసమానతలు తొలిగించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం లింగన్న, స్వామి, గజ్జన్న, ప్రసాద్, సత్తన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సోన్, నవంబర్ 9 : నిర్మల్‌లో అమరవీరుల వారోత్సవాలను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి రాజన్న, మండల నాయకులు రాజు, మురళీ, చిన్నయ్య, రాము, గంగాధర్, లక్ష్మి, గంగామణి పాల్గొన్నారు.

బాలింత ఆచూకీ లభ్యం

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 9 : నిర్మల్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో అదృశ్యమైన బాలింత ఆచూకీ లభించింది. భైంసా మండలం హడ్గాం గ్రామానికి చెందిన నాగమణి ప్రసవం కోసం నాలుగు రోజుల క్రితం నిర్మల్ మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. వైద్యులు శస్త్రచికిత్స చేయగా పాపకు జన్మనిచ్చింది. కాగా శుక్రవారం సాయంత్రం పాపను ఓదిలేసి నడుచుకుంటూ దవాఖాన వెనుక వైపు నుంచి వెళ్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న బంధువులు సమాచారం ఇవ్వడంతో వైద్య సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సీసీ పుటేజీలను పరిశీలించారు. గ్రామస్తులు, బంధువులు వచ్చి బాలింత ఆచూకీ కోసం రాత్రి వరకు వెతకగా దవాఖాన వెనుక ఉన్న చెట్ల పొదల్లో కనిపించింది. బంధువులు, సిబ్బంది దవాఖానలోకి ఆమెను తీసుకువచ్చారు. మానసిక పరిస్థితి వల్ల అలా చేసి ఉంటుందని వైద్యసిబ్బంది పేర్కొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

కుంటాల, నవంబర్ 9 : 18 సంవత్సరాలు నిండిన వారు, 1 జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండబోయే వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎజాన్ ఖాన్ కోరారు. ప్రత్యేక క్యాంపెయిన్ తేదీలైన నవంబర్ 9, 10లో దగ్గరున్న పోలింగ్ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఓలా, కుంటాలలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఇంటి చిరునామా మార్పు, కొత్త ఎపిక్ సవరణలు చేసుకోవడానికి కూడా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్ ఎత్తివేయాలి

నేరడిగొండ, నవంబర్ 9 : ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా రైతుల పక్షాన పోరాడుతూ అండగా నిలిచిన ప్రధానోపాధ్యాయుడు తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) జిల్లా కన్వీనర్ విజయ్‌కుమార్ సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని జిల్లా విద్యావంతుల వేదిక (టీవీవీ) తీవ్రంగా ఖండించింది. టీవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గోవర్ధన్ మాట్లాడుతూ దిలావర్‌పూర్ లో నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీని అక్కడి రైతులు వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. తెలంగాణ సాధన సమయంలో ఆయన ఉద్యమంలో ముందుండి పోరాడిన ఘనత ఉందన్నారు. అలాంటి వ్యక్తి విజయ్ కుమార్‌ను సస్పెన్షన్ చేయడాన్ని బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

లోకేశ్వరం, నవంబర్ 9 : లోకేశ్వరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గౌతమ్ అధ్యక్షతన ఎస్ఐ అశోక్ కుమార్, సిబ్బంది శనివారం సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనార్థాలు , చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులు కళాశాలకు వచ్చే సమయంలో ఎవరైనా పోకిరిలు వేధిస్తే తన స్టేషన్ నంబర్ 8712659541కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జీ శ్రీనివాస్, విఠల్, వెంకటేశ్వర్లు, వినోద్ కుమార్, ప్రమీల రాణి, నవీన్, చిన్నయ్య, హరీశ్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు డిసెంబర్ నెలాఖరుకు ఇవ్వాలి

ముథోల్, నవంబర్ 9 : సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు డిసెంబర్ నెలాఖరులోపు అందజేయాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జేఏసీ తరపున మాజీ సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర జేఏసీ సహాయ కార్యదర్శి వెంకటాపూర్ రాజేందర్ శనివారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి రాష్ట్ర సర్పంచ్ సంఘ ప్రతినిధులను చర్చలకు పిలిచి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ సర్పంచ్‌ల జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, సభ్యులు ఉన్నారు.

ప్రజావాణి రద్దు

ఎదులాపురం/నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 9 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా సోమవారం నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తున్నామని కలెక్టర్లు రాజర్షి షా, అభిలాష అభినవ్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దన్నారు.

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

భైంసాటౌన్, నవంబర్ 9 : దేగాం గ్రామానికి చెందిన హన్మంతు (38) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భైంసారూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మంతు మద్యానికి బానిసై శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భైంసారూరల్ పోలీసులు తెలిపారు.

సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్, నవంబర్ 9: సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ శనివారం హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి అజ్మీర శరత్‌ను కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్టీల మినిమం స్కేల్‌తో పాటు ఉద్యోగ భద్రత కల్పించారు. ప్రతినెల మొదటి తారీఖున వేతనం చెల్లించాలని కోరారు. సమావేశంలో సీఆర్టీల గౌరవ అధ్యక్షుడు తిరుపతి, సీఆర్టీల రాష్ట్ర అధ్యక్షుడు వినంత్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

గత సంవత్సరం నవంబర్ 9న జేసీబీ సహాయంతో నాటిన వృక్షణం

జైలు ఎదుట పెట్రోల్ బంక్ వద్ద నాటుకున్న రావిచెట్టు

మహావృక్షాన్ని రక్షించి సంవత్సరం పూర్తి

ఎదులాపురం, నవంబర్ 9 : ఆదిలాబాద్‌లోని జిల్లా జైలు స్థలంలో కొత్తగా పెట్రోల్ బంక్ నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. అ సమయంలో అక్కడ ఉన్న పెద్ద రావి వృక్షాన్ని జేసీబీ సహాయంతో గత నవంబర్ 9వ తేదీన తొలగించారు. జైలు ప్రాంగణంలో జేసీబీ సహాయంతో నాటి సరిగా సంవత్సరం పూర్తి చేసుకున్నది ఈ వృక్షం. జైలు అధికారుల రక్షించిన ఈ రావి వృక్షానికి ప్రస్తుతం పచ్చని ఆకులతో చల్లని గాలి ఇస్తుంది. వృక్షానికి పునర్‌జన్మ ఇచ్చామని జైలు పర్యవేక్షణ అధికారి అశోక్ కుమార్ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★Supervisors, Sales Exicutives, Team Leaders, Dealers for a Car & Bike Polish Company. Free Room & Cooking facility. Ph: 8019399008.
NT-339365-All

CHANGE OF NAME

I, YELMA RAGHUVARAN (Old name) S/o. YELMA SWAMY REDDY, R/o. H.No.1-34, (V) Kajjarla, (Mdl) Talamadugu, Dist. Adilabad is hereby change my Name as "YELMA RAGHU VARAN REDDY" (New Name) as per All indentification proof except education proof hence declared.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

డిసెంబర్ 1న స్కాలర్‌షిప్ టాలెంట్ టెస్ట్

కరపత్రాలు విడుదల చేస్తున్న మహ్మద్ బిలాల్, తదితరులు

ఎదులాపురం, నవంబర్ 9 : పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం డిసెంబర్ 1వ తేదీన స్కాలర్‌షిప్ టాలెంట్ టెస్టును నిర్వహించనున్నట్లు క్రిసెంట్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ బిలాల్ తెలిపారు. శనివారం ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో స్కాలర్‌షిప్ టాలెంట్ టెస్టుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న విద్యార్థులు www.mfred. org ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ కోర్సులతో పాటు నీట్, ఐఐటీ, జేఈఈ, సీఎల్ఏటీ, ఎన్‌డీఏ, సీఏ ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణ కల్పిస్తామని తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

తలమడుగు, నవంబర్ 9: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని ఎంఈవో వెంకట్‌రావ్ అన్నారు. శనివారం సకినపూర్, రుయ్యాడి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

భారతీయ సనాతన ధర్మం ఎంతో గొప్పది

ఎదులాపురం, నవంబర్ 9: భారతీయ సనాతన ధర్మం ఎంతో గొప్పదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్‌కు చెందిన అయ్యప్ప స్వామి మాలధారులు ప్రశాంత్ రెడ్డి వారి బృందం సభ్యులు శబరిమలకు పాదయాత్రగా వెళ్తున్నారు. ముందుగా ప్రత్యేక పూజలు చేసి వారితో పాదయాత్రలో ఎమ్మెల్యే పాల్గొని సాగనంపారు.

రంజీ ట్రోఫీలో సెంచరీ కొట్టిన హిమతేజ

ఎదులాపురం, నవంబర్ 9 : ఆదిలాబాద్ జిల్లా నుంచి క్రికెట్ క్రీడాకారుడిగా రాణిస్తూ హైదరాబాద్ తరపున రంజీ ట్రోఫీలో ఆడుతున్న కొడిమెల హిమతేజ తొలి సెంచరీ సాధించారు. రాజస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆయన శతకం సాధించగా క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు. జిల్లా నుంచి రంజీ ట్రోఫీకి తొలిసారి ప్రాతినిధ్యం వహిస్తున్న హిమతేజ ట్రోఫీ ఆసాంతం అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్నారు. తాజాగా సెంచరీ సాధించడంతో ఆయన ఆట తీరుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. మాజీ మంత్రి జోగు రామన్న సైతం హిమతేజ సెంచరీ పట్ల హర్షం వ్యక్తం చేశారు. ట్విట్టర్ వేదికగా అభినందనలు తెలిపారు.

17న మాదిగ ఉపకులాల ఉద్యోగుల సదస్సు

ఎదులాపురం, నవంబర్ 9 : ఆదిలాబాద్‌లోని బీసీ భవనంలో మాదిగ ఉపకులాల ఉద్యోగుల సదస్సును ఈ నెల 17వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నట్లు మాదిగ ఉద్యోగుల సమైక్య(ఎంఈఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగు గంగయ్య మాదిగ తెలిపారు. శనివారం ద్వారాకనగర్‌లో సదస్సుకు సంబంధించిన ఫ్లెక్సీను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ మాదిగ, సీనియర్ నాయకులు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల అరెస్టు

సారంగాపూర్, నవంబర్ 9 : రాణాపూర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనలో శనివారం ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. వివరాలు ఇలా ఉండగా... నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న ఆర్టీసీ రాణాపూర్ వద్ద ఆవుల మందను ఢీ కొట్టడంతో ఆవుకు గాయాలయ్యాయి. దీంతో రాణాపూర్ చెందిన కొంత మంది ఆర్టీసీ బస్సును ముందుకు వెళ్లకుండా బైక్‌ను రోడ్డుపై అడ్డంగా పెట్టి గొడవ చేసి డ్రైవర్‌పై దాడి చేశారు. అలాగే కండక్టర్‌తో గొడవ, వెళ్లాన పోలీసు సిబ్బందిపై గ్రామస్తులు దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి ఆడే శ్రీనివాస్, ఆడే మోహన్ నాయక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌క